# 35

# ఉద్యోగాన్వేషణ

తల పగలగొట్టుకోడానికి ఏ రాయి అయితేనేం అన్నారు. నాగోడు ఎక్కడ్నుంచి మొదలు పెట్టినా ఒకటే. దీనికి కృత్యాద్యవస్థ అవసరం లేదు. శుభం పలకరా మంకెన్నా అన్న సామెతగా అశుభంతో ఎందుకు ప్రారంభించాలి అనుకుంటే శుభంతోనే ప్రారంభించవచ్చు అలాగే ప్రారంభిస్తాను.

ఒక శుభోదయాన మా పరీక్షా ఫలితాలు వచ్చాయి. పేపరు చేతికి తీసుకున్నాను చేతులు వణుకుతున్నాయి. చూపు ఆగడం లేదు. మనసులో భయం, ఆందోళన, తాపత్రయం, ఒక్క మాటలో చెప్పాలంటే ఆ స్థితి అనుభవైక వేద్యం. మొత్తానికి పేపర్లో నా నెంబరు ఉంది. ఒకటికి రెండుసార్లు చూశాను. నా నెంబరే. ఎగిరి దూకాలనీ, ఏదో ఒకటి సినిమా పాట గట్టిగా పాడాలనిపించింది.

నేరుగా ఇంటికి వెళ్ళాను. ముఖంలో ఏ భావం ద్యోతకం కాకుండా 'అమ్మా మా రిజల్టు వచ్చాయి' అన్నాను. అమ్మ కసవు పూడుస్తోంది. నా మాట విని నా ముఖంలోకి చూస్తూ నిలబడ్డది. ముఖకవళికల్ని చూసి ఫలితాన్ని పసికట్టడం ఆమెకు సాధ్యం కాలేదు. శుభమే వినాలని ఆమె అణువణువూ ఆరాటపడుతోంది. ఏ అశుభం వినవలసి వస్తుందోనని ఆందోళన చెందుతోంది. ఆమెను ఆ స్థితిలో ఉంచాలనే నేను కోరుకున్నది. అందుకనే నేనేం సమాధానం చెప్పలేదు.

'ఏమైందిరా' అంది గొంతు పెగల్చుకొని సమాధానంగా నవ్వేను అమ్మకు కాస్త ధైర్యం దొరికినట్టుంది.

'ప్యాసయినావు కదా?' అంది.

'ఏమనుకున్నావు నా తడాఖా అంటే' అన్నాను.

'ఏడ్చినావులే' అంటూ ప్రశంసాపూర్వకంగా నావైపు చూసింది. ఆగ్రహమూ, అనుగ్రహమూ, కష్టమూ సుఖమూ, అన్నీ కడుపులో దాచుకోవడం వయసు నేర్పుతుందనుకుంటా, అమ్మ పెద్దగా పొంగిపోతున్నట్లు పైకి వ్యక్తం చెయ్యలేదుగాని ఆమె హృదయం ఆనందంతో పరవళ్ళు తొక్కుతోందన్న విషయం పసిగట్టలేనంత పసిపాపను కాదు. ఒక్క ఏటిదిగాదు. కొన్నేళ్ల పంట నట్టింట కొచ్చినంత సంతోషంగా ఉంది ఆమె మనసు.

ఇంతకూ నేను ప్యాసయిన పరీక్ష ఏదో చెప్పనేలేదు. తెలుగు విద్వాన్, ఎమ్మేనో, బియ్యేనో కాదని పాఠకులు నిరాశపడితే నేనేం చెయ్యలేను సినిమా నాయకుడికైతే ఎమ్మే పరీక్ష ఫస్టున పాస్ కావాలన్న పట్టింపు ఉంటుంది. మనకెందుకా పట్టింపులు? ఉన్నమాట చెప్పుకోడానికి నామోషీ ఫీల్ అయి లాభం లేదు.

★ ★ ★

ఫలితాలు వచ్చాక తృప్తిగా వూపిరి పీల్చుకున్నాను. అవును. నా బాధ్యత తీరిపోయింది. ఇక పాఠ్య పుస్తకాలతో తల పగులగొట్టుకోనవరం లేదు. ఏది పడితే అది చదవచ్చు. ఎక్కడబడితే అక్కడ తిరగవచ్చు. పరీక్షలో తప్పినట్టు, పేపర్లు కష్టంగా ఉన్నట్లు కలలు రావు. నేను విద్వాన్ పాసయ్యాను ఎవరికన్నా అడ్రస్ ఇచ్చేటప్పుడు. పుస్తకాల మీద పేరురాసుకునేటప్పుడు 'గోపాలం విద్వాన్' లేదా 'విద్వాన్ గోపాలం' అని ముచ్చటగా రాసుకోవచ్చు. ఇలాటి సవాలక్ష ఊహలతో నా హృదయం ఎంతో తేలికపడ్డది.

అమ్మ విషయం సరేసరి, ఫలితాలు వచ్చిన రోజున పాయసం వండిపెట్టింది. మరుసటి రోజు మిత్రులకి ఒక పార్టీ ఏర్పాటు చేయాలనుకున్నాను. అమ్మని అడిగితే నోరెత్తకుండా అంగీకరించింది. వచ్చిన మిత్రులు పదిమందికీ పూరీలు కాఫీ ఇచ్చి సంబరపడ్డది.

ఎవరితో ప్రస్తావన వచ్చినా నేను పరీక్ష పాసయిన విషయం ఎత్తుతోంది.

'దేవుని దయవల్ల మా గోపాలం పరీక్ష పాసయ్యాడు' ఇది అమ్మ సంభాషణకు నాంది. ఆ తర్వాత అమ్మ నా చదువుకోసం పడ్డకష్టాలు సంభాషణల్లో చోటు చేసుకుంటాయి. చదువుకుంటున్న రోజుల్లో అమ్మకష్టాన్ని గురించి నేను ఆలోచించలేదు. ఇప్పుడు ఆలోచిస్తే - నా చదువుకోసం అమ్మ చాలా బాధపడినట్లుంది. నా చదువు అమ్మకీ పరీక్షే. కాస్త కలిగిన వాళ్లకయితే నా చదువు లెక్కలోకి రాదు. అమ్మ స్థితివేరు. కూలీనాలీ చేసుకుంటూ నన్ను చదివించింది. మాకు నాలుగెకరాల మెట్ట లేకపోలేదు. కానీ అందులో వచ్చే ఆదాయం బహుస్వల్పం వేణ్నీళ్ళకు చన్నీళ్ళు తోడుగా అమ్మా, చెల్లెలూ కూలీనాలీ చేస్తే తప్ప సంసారం గడవదు.

స్వాతంత్ర్యానికి పూర్వమైతే అమ్మకి నన్ను చదివించాలన్న ఊహేతట్టి ఉండేది కాదనుకుంటా. కాలం మారిపోయింది. ఊరూరా స్కూళ్లు ప్రతి పది పల్లెలకూ ఒక హైస్కూలు - జిల్లాకు రెండు మూడు కాలేజీలు. మొత్తానికి చదువులు కారు చౌక అయ్యాయి. 'చదువులంటే కలిగిన వాళ్లకే' అన్న

భావం సమసిపోయింది. కాస్త కష్టపడితే మనమూ మన పిల్లల్ని చదివించుకోవచ్చు అన్న భావం కూలా నాలీ చేసుకునే వాళ్లకు కూడా కలుగుతోంది. అందుకు మా అమ్మే తార్కాణం. ఈ సామాజిక పరిణామం మంచి చెడ్డల్ని గురించి నేను ముందెన్నడూ ఆలోచించలేదు. ఆలోచించాల్సిన అవసరం కలగలేదనుకుంటా. దేనికైనా అనుభవం గీటురాయి.

ఇప్పుడిప్పుడే నాకు కలుగుతున్న అనుభవాలు నా మెదట్లో ఆలోచనా బీజాల్ని మొలకెత్తిస్తున్నాయి. నా అనుభవాలు ఏమిటంటారూ? అవే మనవి చేస్తున్నాను.

★ ★ ★

జీవితంలో ఏ సంతోషమైనా ఎన్నాళ్లూ తిష్టవేసుకుంటుంది? వారం రోజులు లేదా పదిరోజులు, ఒక పదిహేను రోజులు గడిచేసరికల్లా, నేను ప్యాసు కావడంతో ఏర్పడిన సంతోష వాతావరణం ఇంట్లోనూ, నాలోను అంతరించిపోయింది. అమ్మ మామూలుగా కూలిపనికి వెళ్తోంది. చెల్లెలు సుభద్రా ఇన్నాళ్లూ పనికిపోయేది. పెళ్ళీడు కొచ్చినందునో ఏమో అమ్మ దాన్ని ఇంట్లోనే అన్నం చెయ్యను పెడుతోంది.

సాయంత్రం అయ్యేసరికి ఏ రైతో వచ్చి 'రాములమ్మా' పొద్దున కలుపు తీయను వస్తావా' అనో లేదా మరో పనికి వస్తావా అనో పిలుస్తారు. వెళ్తానంటే సరి, వారిచేలోకో, వీరి చేలోకో వెళ్తున్నానని సమాధానం చెపితే వచ్చినవాళ్ళ రుసరుసలు, సకిలింపులు, ఇవన్నీ నేను చిన్నతనం నుంచీ చూస్తూనే ఉన్నాను. కానీ ఇప్పుడు ఈ సన్నివేశాలు నాలో కంపరమెత్తిస్తున్నాయి. కసి పుట్టిస్తున్నాయి. ఆలోచనల్ని రేకెత్తిస్తున్నాయి. ఇంటిదగ్గర ఉండబుద్ది పుట్టదు. ఏ స్నేహితుల దగ్గరో కూచోబుద్ది అవుతుంది. ఉన్న వాస్తవాన్ని చూచి చూడనట్లు పోవడం కష్టమేమీ కాదు, అయితే అందువల్ల మనశ్శాంతి లభ్యమయ్యేది కల్ల. పరిస్థితులను చక్కపెట్టుకోవాలి. మంచి జీవితం చవి చూడాలి. అదే ఆలోచిస్తున్నాను.

ఏ స్కూల్లోనన్నా జూనియర్ తెలుగు పండిట్ పోస్టు ఖాళీ ఉందేమో చూసుకోవాలి. ఒకయేడాదిపాటు పనిచేస్తే అంతో ఇంతో వెనకేసుకోవచ్చు. దాంతో ట్రైనింగ్ పూర్తి చేసుకోవచ్చు. అమ్మ ఆలోచన కూడా ఇదే.

రోజూ పేపరు చూస్తున్నాను. రాజకీయ విషయాలు తెలుసుకుందామన్న ఆసక్తితోకాదు. ఎక్కడన్నా ఖాళీలున్నాయని ప్రకటనలు కనిపిస్తయేమోనన్న ఆశతో.

నాలుగైదు ప్రైవేట్ స్కూళ్ళు జూనియర్ తెలుగు పండిట్లు అవసరమున్నట్లు ప్రకటించాయి. ఆ ప్రకటనలు చూస్తుంటే ప్రాణం లేచివచ్చింది. అడ్రసులు అన్నీ నోటుచేసుకున్నాయి. అన్ని స్కూళ్ళకు అప్లై చేయాలి. తెల్లకాగితాలు తీసుకున్నాను. ఎలా అప్లై చెయ్యడం? తెలుగులో అయితే ఏదో తంటాలు పడవచ్చు. తెలుగులో రాయడానికి మనస్కరించలేదు. అలారాస్తే వీడికేమీ రాదనుకుంటారేమోనన్న భయం. ఇంగ్లీషులో రాయడానికి కలం ఒక్క అంగుళం కూడా కదలడంలేదు. ఫస్టుఫారం నుంచీ స్కూలు ఫైనలు దాకా అంటే ఐదేళ్లు ఇంగ్లీషు చదువుకున్నాను. అప్లికేషన్ ఫారంలో ఒక వాక్యం రాయడం చేతకావడం లేదు. ఏం చదువులు ఇవి? నామీద నాకే విసుగొచ్చింది.

మా ఇంటి ఎదురుగా పాపిరెడ్డిగారున్నారు. ఆయన కామ్రేడ్, లెఫ్టో, రైటో, నక్సలైటో తెలియదు. హైస్కూలు చదువు పూర్తి కాకపోయినా ఇంగ్లీషు బాగావచ్చు. స్వయంకృషితో నేర్చుకున్నాడు. ఆయన దగ్గరికి వెళ్ళి అడిగితే! నా చదువునీ నన్నూ చిన్నచూపు చూస్తాడేమోనని భయం. గత్యంతరం లేదు. ఆయన దగ్గరికి వెళ్ళాను. నేను వెళ్ళేసరికి ఆయన ఎవరితోనే రాజకీయాలు మాట్లాడుతున్నాడు.

'నువ్వు నూరు చెప్పు లక్ష చెప్పు. సంకటిని, కొర్రన్నాన్ని కూడా కళ్ళకద్దుకొని భోంచేస్తున్నన్నాళ్ళూ ఈ దేశంలో విప్లవాలు రావు' అంటున్నాడాయన.

సంకటి, కొర్రన్నం తినడానికి విప్లవాలకూ గల సంబంధం ఏమిటో నాకు అర్థం కాలేదు. అలాగే నాకు అర్థంకాని విషయాలు వారి సంభాషణల్లో చాలా చాలా దొర్లాయి. చర్చ ముగిసిన తర్వాత ఎదుటి వ్యక్తి లేచిపొయ్యాడు.

పాపిరెడ్డి నా వైపు తిరిగి 'ఏమ్మా ఊరికే వచ్చావా లేక ఏదన్నా పనిమీద వచ్చావా?' అన్నాడు.

వచ్చిన పని చెప్పాను. ఆయన ఏం ఎగతాళి చేస్తాడోనని తలవంచుకున్నాను.

'సిగ్గుపడుతున్నావా?' అన్నాడు ఆయన నవ్వి. ప్రాణం పోక ననూ ఆయన నవ్వులో శృతి కలిపాను.

'చూడు గోపాలం! ఏ విషయంలోనూ సిగ్గుపడకూడదు. మనకు తెలిసిన విషయాలకంటే తెలియని విషయాలే ఎప్పుడూ అనేకం ఉంటాయి. ఒక మంచి కథకుడికి దాపట అంటే ఏమిటో వలపట అంటే ఏమిటో తెలియకపోవచ్చు. ఒక మంచి శాస్త్రజ్ఞుడు ఒక వాక్యం కవిత్వం రాయలేకపోవచ్చు. చదివి అర్థం చేసుకోవడం చేతకాకపోవచ్చు. అంతెందుకు 'అమ్మహోత్మ్ముడు' ఏ సంధి అని అడిగితే నువ్వు తకీమని చెప్పగలవు. నేను చెప్పలేను. తెలియని విషయాలు తెలుసుకునేందుకు ప్రయత్నం చెయ్యాలి. తెలియనందుకు సిగ్గుపడకూడదు' అన్నాడు.

నా ప్రాణం కుదుటపడింది.

అప్లికేషన్ ఆయన డిక్టేట్ చేస్తే నేను రాసుకున్నాను.

'అప్లై చేస్తున్నావు బాగానే ఉంది. కానీ మంత్రాలకు చింతకాయలు రాల్తాయా నాయనా' అన్నాడు.

'ఏ పుట్టలో ఏ పాముందో ఎవరు చూశారు' అన్నాను. ఆయన నవ్వి 'నేను నిరాశ పరచను. కానివ్వు' అన్నాడు. అప్లికేషన్లు పూర్తయ్యాయి. ప్రతి స్కూలు కరస్పాండెంట్‌తో బాటూ ఆ జిల్లా విద్యాశాఖాధికారికి కూడా ఒకటి పంపాలి. మొత్తం పదికవర్లు, రెండు రూపాయలు. విషయం చెప్పి 'అమ్మా రెండు రూపాయలు డబ్బుంటే ఇవ్వు' అన్నాను.

'చదువు అయిపోయింది. డబ్బు ఖర్చు ఉండదనుకున్నాను. పదీ అయిదూ ఇంకా అడుగుతూనే ఉన్నావు. ఇదేమిట్రా' అని విసుగు వ్యక్తం చేసింది. అమ్మ విసుగుకు కారణముంది. సరిగ్గా రెండు రోజుల క్రితం సర్టిఫికెట్ తెచ్చుకోవాలని పది రూపాయలుఅడిగి ఇప్పించుకున్నాను. ఆ రోజు అక్కడా ఇక్కడా బదులు చేసి తెచ్చి ఇచ్చింది. మళ్ళీ ఈ రోజు రెండు రూపాయలు.

రెండు రూపాయలంటే మాటలు కాదు. అమ్మ రెండు రోజులు ఎండలో చెమటోడ్చాలి. ఆమె విసుగుపడటంలో అసహజమేమీ లేదు. చదువు పూర్తికాగానే ఉద్యోగం వస్తుందని అమ్మ అనుకొని ఉన్నట్లుంది. ఇల్లలకగానే పండగకాదని అమ్మతో చెప్పి ఆశల్ని నిరాశ చెయ్యడం ఇష్టం లేదు.

ఉద్యోగానికి అప్లై చేస్తున్నాననీ, త్వరలోనే ఉద్యోగం వస్తుందనీ చెప్పాను.

నాలుగు తెల్ల కాగితాలు నల్లచేసి నాలుగుచోట్లకు తరలించాను. ఏదన్నా ఛాన్సు తగులుతుందేమోనని. రోజూ పోస్టు దగ్గర ఎదురు చూస్తున్నాను.

'ఎక్కడ్నుంచన్నా ఇంటర్వ్యూ వచ్చిందా?' అన్నాడు పాపిరెడ్డి ఒక రోజు. లేదన్నట్టు చప్పరించాను.

'నే చెప్పలేదూ! మంత్రాలకు చింతకాయలు రాలవని' అన్నాడు.

'ఏం చెయ్యమంటారో కాస్త సలహా చెప్పండి' అన్నాను.

'ఏదన్నా సిఫార్స్ చూడు. అది లేకుండా ఆ పరమేశ్వరుడు కూడా ఉద్యోగం సంపాదించలేడు' అన్నాడు.

'నిజమే. ఆ విషయం నాకూ తెలుసు నేను అండా ఆపులేని 'దిక్కు లెస్', ఎవరు పలుకుతారు నాకు' ఎవరున్నారు నాకు' అన్నాను దీనంగా.

అట్లా అంటే లాభం లేదు. ఏ వెదవనో ఒక వెధవను కాళ్లూ, కడుపు పట్టుకొని బ్రతిమలాడి పని సాధించుకోవాలి. చొరవ లేకపోతే ఎక్కడున్నా వాడివి అక్కడే ఉంటావు. ఒక్క అంగుళం కదల్లేవు' అన్నాడు.

'పోనీ మన సర్పంచిని పట్టమంటారా!' అన్నాను.

'వాడి పాదం పట్టి ప్రయోజనం లేదు సమితి ఎలక్షన్లలో ఓటును వేలం పెట్టి పదివేలకు అమ్ముకున్నాడు. వీడి సిఫారసు వెళ్తే సమితి ప్రెసిడెంట్ చెప్పు తీసుకొని వెంటబడతాడు' అన్నాడు.

'నిజమే! ఓటు అమ్ముకొన్న వాడిమాట ఎవరు ఖాతరు చేస్తారు. నాకు ఆయన తప్ప ఎవరూ తెలియదు. ఆయనయినా పెద్దగా తెలియదు. ఉండూరు సర్పంచ్ గనక మాట తోసెయ్యలేక సిఫార్సు చేయవచ్చు.

ఆయన సిఫార్సుకు నయాపైసా విలువలేదని తేలిపోయింది. ఏం చెయ్యడమా' అని ఆలోచనలో పడ్డాను.

'కాస్త పలుకుబడి గల మిత్రులెవరూ లేరా !' అన్నాడు పాపిరెడ్డి. సమయానికి జ్ఞాపకం చేశాడు. ప్రిలిమినరీలో నరసింహారెడ్డి అని నా క్లాస్ మేటోకడుండే వాడు. ప్రిలిమినరీ అయిపోగానే వాడు డిస్‌కంటిన్యూ చేశాడు. ఇంటి దగ్గర బాగా ఆస్తిపాస్తులున్నవాడు. వాడికి చదువెందుకు? వీపున ఈతకాయవున్నవాడు, ఈదనవసరం లేదు. వాడు వూళ్ళోనే వుండి వ్యవసాయం చూసుకుంటూ సర్పంచ్‌గా ఎన్నికయ్యాడు.

వాడ్ని కలిస్తే! నాకు ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది.

'ఉన్నాడండీ ఒక మిత్రుడు' అన్నాను.

'ఇంకేం? అతణ్ణి కలుసుకో' అన్నాడు.

గబగబా ఇంటికొచ్చి ప్రయాణ సన్నాహం చేస్తున్నాను.

'ఎక్కడికిరా ప్రయాణం?' అంది అమ్మ.

అమ్మకు విషయమంతా విడమర్చి చెప్పాను. సంతోషిస్తుంది అనుకున్నాను. కానీ అమ్మ ధోరణి వేరుగా వుంది.

'లేడికి లేచిందే ప్రయాణమని ఉట్టిపాటు ప్రయాణమనగానే సరా? డబ్బు విషయం ఆలోచించావా?' అంది.

'నీ దగ్గర లేదా?' అన్నాను నసుగుతూ.

'లేకేం. అమ్మ దగ్గర ఖజానా వుంది'. అంది రుసరుస లాడుతూ ఆదిలోనే హంసపాదు. నాలో నిగ్రహం చచ్చిపోతుంది.

'మరి ఏ ప్రయత్నం చేయకుండా ఇంట్లోనే కూచోమంటావా?' అన్నాను.

'ఎప్పుడు పడితే అప్పుడు డబ్బెలావస్తుంది.'

'ఏదో ఒక తిప్పలు పడాలి?'

'ఆ తిప్పలేమిటో చెప్పరాదూ?'

మాటకు మాట తెగులు. చిన్నసైజు ఘర్షణ ప్రారంభమైంది. నేను బాగానే రెచ్చిపోయాను.

'ఛార్జీలకు కూడా డబ్బులివ్వలేని దానివి మరి నన్నెందుకు చదివించావ్?' అన్నాను.

'బుద్ధిలేక, ఇప్పుడు తప్పు ఒప్పు కుంటున్నాను. సరేనా?' అంది ఘర్షణ మరీ పెరిగేదే కానీ సుభద్ర కలుగచేసుకుంది.

'అమ్మా నా చెవుల్లో కమ్మలున్నాయి. ఇవి తీసుకెళ్ళి ఎక్కడన్నా డబ్బు తీసుకురా. వూరికే ఎందుకీ గొడవంతా' అంది. అమ్మ ఏమనుకుందో ఏమో సుభద్ర సలహాను అంగీకరించింది. అది ఎక్కడో తాకట్టు పెట్టి ముప్పయి రూపాయలు తెచ్చింది.

నేను ఉద్యోగ ప్రయత్నం చెయ్యడం అమ్మకు ఇష్టంలేక కాదు. ఈ గొడవంతా డబ్బులేక. డబ్బు చేతికి వచ్చాక అమ్మకూడా శాంతించింది.

ఏ ఘర్షణా జరగనట్లే నన్ను సాగనంపింది.

అదృష్టం కొద్దీ నేను వెళ్ళేసరికి నరసింహారెడ్డి ఇంట్లోనే ఉన్నాడు. ఇద్దరం విడిపోయి రెండేళ్ళకుపైగా అయింది. నన్ను చూచి సంతోషించాడు.

'ఏరా ఇలా వచ్చావు? బాగున్నావా?' అన్నాడు.

చదువుకునేటప్పుడు ఇద్దరం చాలా చనువుగా ఒరే అంటే ఒరే అనుకునే వాళ్ళం. వాడు అది ఇంకా మరిచిపోలేదు. ఇల్లూ అదీ చూస్తే వాణ్ణి ఒరే అని పిలవడానికి నాకు ధైర్యం చాల్లేదు.

ఇద్దరి మధ్యా ఏదో అంతరం ఉన్నట్లు ఫీలయ్యాను.

'నీతో పనిబడి వచ్చానోయ్' అన్నాను.

'ఏం పని?'

'సమితి ప్రెసిడెంట్‌కు కాస్త సిఫార్సు చేయాలి.'

'సిఫార్సుదేం భాగ్యం కానీ, నేను ఇల్లు కదిలే స్థితిలో లేనే' అన్నాడు.

'ఏం!' అన్నాను దిగులుగా.

'గ్రామ పార్టీ బాగా టెన్షన్‌లో వుంది. ఇల్లు కదలాలంటే భయం' అన్నాడు.

'గ్రామ పార్టీల్లో నువ్వెందుకు ఇన్వాల్వ్ అయ్యావు?' అన్నాను.

'సర్పంచ్ ఎలక్షన్లలో పోటీచేశాను. అది గ్రామపార్టీకి దారితీసింది. ఏం చెయ్యను?' అన్నాడు.

'బాగుంది ఆ వెదవ ఎలక్షన్లలో కంటెస్టు చేయకపోతే ఏం కొంపమునిగేది!' అన్నాను.

'కొంప మునిగేదేమీ లేదు. కాని ఏ అధికారమూ లేకపోతే ఎవడు పలకరిస్తాడు?' అన్నాడు.

డబ్బు, అధికారం, ఇవే రాజ్యం చేస్తున్నపుడు ప్రతివాడూ వాటికోసం వెంపరలాడక తప్పదేమో.

'నీ మీద చాలా ఆశలు పెట్టుకొనే వచ్చాను' అన్నాను.

'సరే భోం చెయ్యి, తర్వాత ఆలోచిద్దాం' అన్నాడు. భోజనం అయిన తర్వాత ఆలోచించిందేమీ లేదు. వాడు ప్రయాణమయ్యాడు. ఈటెలూ, గండ్రగొడ్డళ్ళూ తీసుకొనివాడి వెంట ఒక చిన్న దండు కూడా బయలుదేరింది. నాకు గుండెలు అవిశాయి ఈటెలూ, గండ్ర గొడ్డళ్ళూ చూచికాదు. వీళ్ళందరికి బస్సు ఛార్జీలు పెట్టడానికి నా దగ్గర చాలినంత డబ్బు లేదు. వాడితో ఖర్చులు పెట్టిస్తే వాడేమనుకుంటాడో! దేవుడా ఏమిటీ అగ్నిపరీక్ష అనుకున్నాను. ఈ మందీ మార్బలం దేనికి అని వాడితో అనడానికి నాకు ధైర్యం చాల్లేదు. విచ్చలవిడిగా ఖూనీలు, దొమ్మీలు జరుగుతున్నాయి. ఇద్దరమూ బయలుదేరితో దారిలో ఏదన్నా అభమో శుభమో జరిగితే నింద నాకొస్తుంది. మొత్తంమీద పెద్ద సంకటావస్థలో పడ్డాను.

ఏమైతేనేం? దేవుడు నా పాలిట ఉన్నాడు. ఛార్జీలకు డబ్బు నాతో పెట్టనివ్వలేదు వాడు. నా బస్సు ఛార్జీ కూడా వాడే పెట్టాడు. గండం గడిచినందుకు ఏడుకొండలవాడ్ని ఒకటికి పదిసార్లు స్మరించాను. ఎందుకో చెప్పలేను గానీ, వెళ్తున్న కార్యం జయప్రదమవుతుందని కూడా అనిపించింది ఆ క్షణాన.

మరో శుభసూచకమేమిటంటే మేము వెళ్ళేసరికి సమితి ప్రెసిడెంట్, ఏ కొండకూ వెళ్లకుండా ఇంటిదగ్గరే ఉన్నాడు. కాని సమితి వసతి గృహ ప్రాంగణాన చిన్నసైజు తిరుణాల చూసేసరికి నేను నిలువునా నీరు కారిపోయాను. ఎరువు అప్పులకొచ్చిన వాళ్ళూ, కరువు అప్పులకొచ్చిన వాళ్ళూ, ట్రాన్స్‌ఫర్ల కొచ్చినవాళ్ళూ, సీమ పందులకోసం వచ్చినవాళ్ళూ, గ్రామ ప్రెసిడెంట్లు, పాలెగాళ్ళు ఎవరు లేరు? అంతా అక్కడే ఉన్నారు. ఇంతమందిలోనూ నరసింహారెడ్డికి ఇంటర్వ్యూ దొరుకుతుందో దొరకదో? నరసింహారెడ్డి ముఖంవైపు చూశాను. ఇంటి దగ్గర అట్టహాసంగా బయలుదేరాడు. ముఖంలో ఆ అట్టహాసం ఇప్పుడు ద్యోతకం కావడంలేదు.

'ఇంట్లో ఎవరెవరున్నారు?' అన్నాను రహస్యం అడుగుతున్నట్లుగా నా పక్క వ్యక్తితో.

'సమితి సైన్యం యావత్తూ అక్కడే ఉంది' ఆ వ్యక్తి.

'ఏం చేస్తున్నట్టు!' అన్నాను.

'బయట నుంచి బిరియానీలు, వేపుళ్ళూ వెళ్తున్నాయి. వెట్ డిన్నరు ఉన్నట్లుంది' అన్నాడు.

'అందుకే కాబోలు! ఎవరూ లోపలికి వెళ్ళకుండా బయట తచ్చాడుతున్నారు' అనుకున్నాను.

ఈ వెట్ డిన్నరు ఎంతసేపటికి ముగుస్తుందో! కాళ్ళు పీకుతున్నాయి. కాసేపు కాలక్షేపమవుతుందని నేను నా పక్క వ్యక్తితో మాటల్లోకి దిగాను.

'ఏం పనిమీద వచ్చారు?' అన్నాను.

'మొగుణ్ని ఒకసారి దర్శనం చేసుకొని కాస్త పాదధూళి నెత్తిన చల్లుకుందామని వచ్చాను' అన్నాడు.

'మొగుడెవరు' అన్నాను నవ్వుతూ.

'టీచర్లకు మొగుడెవరో తెలీదా?' అన్నాడు.

'అర్థమైంది. అయితే మిమ్మల్ని శంకరగిరి మాన్యాలు పట్టించారన్న మాట. ట్రాన్స్‌ఫర్ చేయించుకుందామని వచ్చారా? అన్నాను.

ఆయన తలూపాడు.

'ఒక్కరే వచ్చారా?' అన్నాను.

'లేదు. రెకమెండ్ చేయడానికి మిండగాడొకడు కావాలి. మా ఊరి సర్పంచ్‌ని వెంటబెట్టుకొని వచ్చాను' అన్నాడు.

'సమితి ప్రెసిడెంట్ బాగా చదువుకున్నవాడేనా?' అన్నాను. చదువుంటే గుమాస్తానో, టీచరో అవుతారు కానీ రాజకీయాల్లో రాణిస్తారా? అంటూ ఎదురుప్రశ్న వేశాడు.

ఈయనెవరూ కాని మాట్లాడుతూ ఉంటే బాగానే కాలక్షేపం అవుతోంది. కాని ఉన్నట్టుండి జనంలో కలకం బయలుదేరింది. ఏమిటబ్బా అని చూస్తే సమితి ప్రెసిడెంట్ గడపదాటి బయటికి వచ్చాడు. జనమంతా నమస్కారాలు చేస్తూ దైవదర్శనం కోసం ఎగబడినట్లు ఎగబడుతున్నారు. మా నరసింహారెడ్డి ఎక్కడున్నాడోనని చూచాను. ఫర్వాలేదు. వాడూ ఎగబడుతున్నాడు. ఎందుకైనా మంచిదని సందుచేసుకొని వాడి దగ్గరికి వెళ్ళి నిలబడ్డాను.

ఇంతమంది భక్తుల్ని ఎలా సంతృప్తి పరుస్తాడా అని ఆలోచిస్తున్నాను. కాని సమితి ప్రెసిడెంట్ మొత్తానికి అసాధ్యుడులాగే ఉన్నాడు. అందరి భక్తులమీద కటాక్ష వీక్షణం ప్రసరించాడు. ఒక క్షణంలో అందరి నమస్కారాలు అలవోకగా అందుకున్నాడు. ఒకరిభుజం మీద చెయ్యి వేస్తూ మరొకరి వైపు తిరిగి 'నీ విషయం పరిషత్ చైర్మన్‌తో మాట్లాడాను' అన్నాడు. క్షణమాలస్యం కాకుండా మరొకర్ని ఉద్దేశించి 'రేపు ఆఫీసుకు రావయ్యా నీ విషయమేదో ఆలోచిద్దాం' అన్నాడు.

ఎవరో టీచరు కామాలు దగ్గరికి వెళ్ళి తన గోడు వెళ్ళపోసుకోబోయాడు. సమితి ప్రెసిడెంట్‌గారు ముఖం చిట్లించి -

'స్కూలుకు సెలవు పెట్టేవచ్చారా?' అన్నాడు.

'పెట్టే వచ్చానండీ' అన్నాడు చేతులు నలుపుకుంటూ.

'బాగానే ఉంది. స్కూలుకు సెలవుపెట్టి ఇలా మా చుట్టూ తిరగడం కన్నా మరే పనిలేదటయ్యా నీకు! పో పో బుద్ధిలేకపోతే సరి' అంటూ ఈసడించుకున్నాడు.

ఇంటిముందున్న జీపు కదలడానికి సిద్ధంగా వుంది. ప్రెసిడెంటుగారు వెళ్ళి కారులో కూర్చుంటున్నారు. మా నరసింహారెడ్డి గబగబా వెళ్ళి మరోసారి నమస్కారం చేశాడు.

'ఓహో నువ్వటయ్యా ఏమిటి విషయం' అని బి.డి.ఓతో ఏదో చెబుతున్నాడు.

'అవ్వలి మొగంబైనంతనే మాయె' అనుకున్నాడేమో నరసింహారెడ్డి వచ్చిన పని సంక్షిప్తంగా చెప్పాడు. జీపు రొదచేస్తూ వెళ్తుండగా 'చూద్దాంలేవయ్యా! మరోసారి కనిపించు. ఇపుడు వెంకటాపురంలో స్కూలు బిల్డింగు శంకుస్థాపనకు వెళ్తున్నాను' అన్నాడు.

'దేవుడు వెళ్ళిపోయాడు. భక్తులు మిగిలారు. ఒక్కసారి అందరివైపు పరకాయించి చూశాను. ప్రెసిడెంట్ అందరికీ అన్నివైపులా దర్శనమిచ్చాడు. అందరి వదనాల్లోనూ ఏదో సంతృప్తి తాండవిస్తోంది.

భుజాలమీద చేతులు వేయించుకున్న వాళ్ళూ, వీపులు తట్టించుకున్న వాళ్ళు, రెట్టింపు సంతృప్తి అనుభవిస్తున్నారు. చివాట్లు తిన్న ఉపాధ్యాయ మహాశయులు కూడా బాధపడుతున్న ఛాయలు కనిపించలేదు. 'తిడతాడు కాని పొట్ట కొట్టడు. అదే ఆయనలో ఉన్న ప్రత్యేకత' అని ఎవరితోనే చెబుతున్నాడు. పొట్టకొట్టకపోతే మాత్రం తిట్టాలనే రూలు ఎక్కడుందో నాకు బోధపడలేదు. అధికారంలోవున్న వ్యక్తి తిట్టినా సమర్థించుకోవడానికి సంసిద్ధంగా ఉన్నారు జనం.

వీపు మీద చెయ్యి పడ్డది. చూద్దునుగాదా నరసింహారెడ్డి. 'ఇంకేమీ ఆలోచించకు, విన్నావుగా, చూద్దామనుకున్నాడు. మళ్ళీ ఒకసారి కలుసుకుందాం. మన పని సానుకూలమైనట్టే లెక్క' అన్నాడు.

మెదలకుండా వూరుకుంటే బాగుండదని సంతోషం ప్రకటించాను. ఒకటి రెండుసార్లు తిరిగితే పని సానుకూల మవుతోందన్న భరోసా కలగడం లేదు. పదే పదే విడవకుండా గోచీకట్టుక తిరిగితే కొంత సాధించ వచ్చునేమో ఒక్కసారి ఇల్లు కదలడానికే తాతలు దిగివచ్చారు. పదే పదే ఎలా తిరగడం! ఇవన్నీ ఇప్పుడాలోచిస్తే కాదు. నరసింహారెడ్డికి కృతజ్ఞత తెలిపాను. నరసింహారెడ్డి తన సొంతపని మీద వూళ్లోకి వెళ్ళాడు. నేను భారంగా వూపిరి పీల్చుకున్నాను.

'కలడు కలండనెడివాడు కలడో లేడో' అని గజేంద్రుడికి కలిగినట్టు నాలోనూ ఒక సందేహాడోల ప్రారంభమైంది. అయితే ఈ సందేహడోల అట్టేకాలం నిలవలేదు.

కావలిలో ఉన్న ఏదో మిషనరీ స్కూలు నుంచి ఇంటర్వ్యూకు పిలుపు వచ్చింది.

నిస్సందేహంగా దేవుడున్నాడు అనుకున్నాను. నాలాటి దిక్కులేని వారికి దిక్కు చూపడమనే తన పవిత్ర కర్తవ్యాన్ని ఆయన ఇంకా నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నాడనే నమ్మకం కూడా కలిగింది.

'చూచారా! నవ్విన నాపచేనే పండింది' అన్నాను పాపిరెడ్డిగారి దగ్గరికి వెళ్ళి.

'ఏమైంది' అన్నాడు పాపిరెడ్డి.

'మనం నెలకిందట కావలికి అప్లయ్ చెయ్యలేదూ! ఇప్పుడు ఇంటర్వ్యూ వచ్చింది.'

'అంతేనా? నీ ధోరణి చూసి ఎప్పాయింట్‌మెంట్ ఆర్డర్లు వచ్చిందేమో ననుకున్నాను.'

'మీరు మరీ నిరాశావాదులు, చూస్తావుండండి, వారం రోజుల్లో పోస్టింగ్ ఆర్డరు కూడా సంపాదిస్తాను' అన్నాను.

'మంచిది' అన్నాడు ఆయన. మొన్న సమితి ప్రెసిడెంట్‌ను కలుసుకోవడానికి వెళుతూ తీసుకెళ్ళిన ముప్పయి రూపాయల్లో ఇరవై రూపాయలు ఇంకా మిగిలేవున్నాయి. దానికితోడు మరొక పదిరూపాయలు జతైతే పని గడుస్తుంది. కాని అమ్మ మళ్ళీ ఏం రగడ ప్రారంభిస్తుందోనని భయం. అందుకని అమ్మ దగ్గరకు వెళ్ళి రాజీ ధోరణిలో చెప్పాను. 'అమ్మా! వెళ్ళేముందు గొడవచేస్తే వెళ్ళిన పని సవ్యంగా జరగదు. మొన్నా అలాగే జరిగింది. ఇంటర్వ్యూలు ఈ సారయినా నన్ను సక్రమంగా పంపు' అని.

అమ్మ నిట్టూర్చి 'ఇంట్లో ఇరవయి రూపాయలుంది. ఇంకా ఎంతయితే సరిపోతుంది' అన్నది.

'ఎక్కడయినా ఒక పదిరూపాయలు చూడమ్మా చాలు' అన్నాను.

అమ్మ ఏం అగచాట్లు పడిందో ఏమో, ఊరంతా తిరిగి పదిహేను రూపాయలు తెచ్చి ఇచ్చింది. అడిగిన దానికంటే ఎక్కువే ఇచ్చింది.

సర్టిఫికెటూ అవీ తీసుకొని ఇల్లు కదిలాను. సుభద్ర మంచినీళ్ళ కడవతో ఎదురుగా వచ్చింది.

అన్నీ శుభ శకునాలే!

ప్రయాణం చేస్తున్నంత సేపూ ఇంటర్వ్యూను గురించే ఆలోచిస్తున్నాను. ఆ ఉద్యోగం నాకే దక్కుతుందని మనసులో ఆశ. ఆ ఆశ చుట్టూ అనేకమైన తీయటి ఊహలు. ఊహాలోకంలో విహరిస్తూంటే ప్రయాణపు బడలికే కనిపించలేదు.

కావలిలో దిగేసరికి బాగా చీకటిపడింది. మూడు రూపాయలిచ్చి లాడ్జిలో గది ఒకటి తీసుకున్నాను. ఒక రాత్రి గడిపేందుకు, గదిమీద మూడు రూపాయలు వెచ్చించడం సంతోషంగా ఏమీలేదు. కానీ తప్పనిసరి. రేపు మధ్యాహ్నం ఇంటర్వ్యూకు వెళ్లేసరికి స్నానంచేసి, బట్టలు మార్చుకొని కాస్త నీటుగా వెళ్ళాలి. గది అంటూ ఒకటి లేకపోతే రోడ్డుమీద చేసుకునేవిగాదు ఈ పనులన్నీ.

డబ్బు పోతేపోయింది. రాత్రి సుఖంగా నిద్రపట్టింది. టైమ్ ఎంతయిందో ఏమో లేచేసరికి బారెడెక్కింది. స్నానం, కాఫీ అన్నీ ముగించుకొనేసరికి తొమ్మిదిన్నర అయింది. పదకొండున్నరకు ఇంటర్వ్యూ. ఇంకా రెండు గంటల టైమ్ వుంది. ఇంటర్వ్యూకు ఎంతమంది వచ్చారో ఏమో! ఏమవుతుందో? గుండెలలో దడ ప్రారంభమయింది. కాసేపు ప్రశాంతంగా కూర్చుందామన్నా స్థిమితం చిక్కలేదు. గదిలో పచార్లు చెయ్యడం మొదలుపెట్టాను. ఎంతసేపటికీ పదకొండు కాదు. పదిన్నరకే సర్టిఫికెట్లు ఫైలు చంకన పెట్టుకొని బయలు దేరాను. స్కూలు దగ్గరే పదినిమిషాల నడక.

స్కూలు ఆవరణలోకి వెళ్ళగానే చుట్టూ ఒకసారి పరకాయించి చూశాను. నా 'దాయాదులు' ఇంకా ఎవరన్నా వచ్చారేమోనని.

స్కూలుకు అటుప్రక్క చెట్టుక్రింద ఎవరో ఒక అమ్మాయి నిలబడి ఎక్కడో శూన్యంలోకి చూస్తోంది. చేతిలో ఫైలు వుంది, ఇంటర్వ్యూకు వచ్చిన బాపతే సందేహం లేదు. హతవిధీ!

దగ్గరకు వెళ్ళి దాయాది మత్సరం కనబడనీకుండా నవ్వుతూ 'ఇంటర్వ్యూకు వచ్చారా!' అన్నాను.

'అవునండీ' అంది. ఆ అమ్మాయి సన్నగా నవ్వి.

'విద్వానా?' అన్నాను.

'అబ్బే. లేదండీ బి.ఎ. స్పెషల్' అంది.

నాకు కొంచెం ఊరట దొరికింది. క్వాలిఫైడ్‌ను తీసుకునే పక్షంలో నాకే ఛాన్సు ఉంటుంది.

'మనిద్దరమే వచ్చినట్టుంది' అన్నాను.

'ఇంకొక అబ్బాయి వచ్చాడు' అంది.

'ఏడీ?' అన్నాను. ఆ ముఖాన్నీ కాస్త చూద్దామని.

'స్టాఫ్ రూంలో ఉన్నాడనుకుంటాను' అంది.

'రండి మనమూ వెళ్ళి అక్కడే కూర్చుందాం' అన్నాను.

'మీరు వెళ్తారేమో వెళ్ళండి. స్టాఫ్ రూంలో ఒకటేగోల. తలనొప్పి వస్తుంది. చెట్టుకింద ప్రాణానికి హాయిగా వుంది'. అంది.

అమ్మాయి కాస్త సెన్సిటివ్‌లాగుంది. ముఖంవైపు చూచాను. ఆకర్షణీయంగానే ఉంది. కాస్త నలుపు. క్రిస్టియన్ కామాలు. క్రిస్టియన్లనీ, కోమట్లనీ వెయ్యిమందిలో ఉన్నా గుర్తించవచ్చు. స్పెషల్ టైపు.

'మీ పేరేమిటండీ' అన్నాను.

'జోసఫీన్' అంది.

నే నూహించింది నిజమే. గుండెదడ ప్రారంభమైంది. కరస్పాండెంట్ క్రిస్టియన్. ఈ అమ్మాయి క్రిస్టియన్. నా నోట్లో కరక్కాయ పడ్డట్టే.

'మీరు బి.ఎ. ఎప్పుడు పాసయ్యారు?' అన్నాను.

'మూడేళ్ళయింది' అంది.

'మూడేళ్ళ నుంచీ ఉద్యోగమే దొరకలేదా?' అన్నాను ఆశ్చర్యంగా.

'గడార్లు గాలికిపోతుంటే ఏకులు నాగతేం అన్నాయట. ఇంజనీర్లకూ, డాక్టర్లకే ఉద్యోగుల లేక ఏడుస్తున్నారు. మనదేముంది?' అన్నది నిర్లిప్తంగా.

'బి.ఇడికి వెళ్ళలేకపోయారా?' అన్నాను.

'పోవచ్చు. గవర్నమెంట్ కాలేజీల్లో సీట్లు దొరకవు. ప్రైవేట్ కాలేజీల్లో రెండువేలో మూడువేలో డొనేషన్ ఇస్తే తప్ప సీట్లు ఇవ్వరు. నాలాంటి వాళ్ళకి ఎక్కడవుతుంది' అన్నది.

బ్యాక్‌వర్డ్ క్లాసు గనుక ఏ స్కాలర్‌షిప్ మీదో చదువుకొని ఉంటుంది. నిజమే డొనేషన్ ఎక్కడ్నుంచి తేగలదు.

'టైమ్ పదకొండు అయివుంటుంది. కరస్పాండెంట్‌ను కలుసుందాం పదండీ' అన్నాను.

'వెళ్దామంటారా' అంది జోసఫీన్ నవ్వుతూ.

'ఏమిటి మీరనేది?'

'ఏమీ లేదు. ఇంటర్వ్యూకు ఇంకో అబ్బాయొచ్చాడని ఇందాక నేను చెప్పలేదూ. ఆ అబ్బాయి ఆరువందలిచ్చి ఉద్యోగం కొన్నాడు' అంది.

నా ముఖంలో నెత్తురుచుక్క లేదు! కాసేపు నోటమాట రాలేదు.

'నిజమా' అన్నాను తేరుకొని.

కారు వచ్చే ముందు టైపిస్టు నా దగ్గరికి వచ్చాడు. 'పోస్టింగ్ ఆర్డర్స్ టైప్ చేస్తున్నాను. ఆశ ఎందుకు తల్లీ వెళ్ళిపో' అని సానుభూతి కనపరచిపోయాడు' అంది.

'అన్యాయం' అన్నాను.

మామూలే' అంది.

'మరి ఇంటర్వ్యూ అంటూ ఈ ఫార్సు దేనికి' అన్నాను.

'చెబుతున్నానుగా అన్నీ మామూలే. మీకు అనుభవం లేనట్టుంది. ఇంతదూరం వచ్చాక ముఖం చూపకుండా ఎందుకు వెళ్ళడం. పదండి ముఖం చూపుదాం' అంది.

నా మెదడు పనిచెయ్యడం మానివేసింది. ఆఫీసు దగ్గరకు ఇద్దరమూ మౌనంగా వెళ్ళాం.

'ఇంటర్వ్యూకి వచ్చారేమో లోపలికి వెళ్ళండి' అన్నాడు ప్యూన్.

కరస్పాండెంట్ ఏదో రాసుకుంటున్నాడు. జోసఫీన్ తలుపు దగ్గరే నిలబడింది. నేను లోపలికి వెళ్ళాను. నన్నాయన గమనించలేదో, గమనించీ గమనించనట్లు నటిస్తున్నాడో తల పైకెత్తలేదు.

శబ్దం అయ్యేట్లు కుర్చీలాగి ఎదురుగా కూర్చున్నాను.

'వేర్ డూ యూ కం ఫ్రం?' అన్నాడు స్టైలిష్‌గా. కడపనుంచి వచ్చాను అని మర్యాదగా జవాబు చెప్పడానికి నాకు మనస్కరించలేదు. నిండా మునిగినవాడికి చలేమిటి?

'తెల్లదొరల వారసుడిలా ఇంగ్లీషులో అడుగుతున్నారు. తెలుగు రాదా మీకు?' అని ప్రశ్నించాను. దీన్నే పచ్చి బూతులో ప్రశ్నించాలనుకున్నాను గానీ నాలుక మీదికి వచ్చి ఆగిపోయింది.

అంతే! ఆ ప్రశ్నకే కరస్పాండెంట్ హడలి చచ్చాడు. వూహించని పరిణామం.

'నీకు పిచ్చా?' అన్నాడు తడబడుతూ.

నాకు మంట పుట్టింది! 'నాకు పిచ్చి అనే లంజాకొడుకుని, ముఖంమీద చెప్పుతో కొడతాను' అన్నాను.

'యూ స్కౌండ్రల్, గెటవుట్' అని గదిగోడలు బ్రద్దలయ్యేట్టు అరిచాడు.

ఈ గొడవకు స్టాఫ్ రూంలోవున్న టీచర్లంతా పరుగెత్తుకుంటూ వచ్చారు.

నేను బయటకు వెళ్ళలేదు. సభ్యతా సంస్కారాలను ప్రక్కన పెట్టి తిట్లకు లంకించుకున్నాను. అచ్చం తెలుగు తిట్లు, కరస్పాండెంట్ అమ్మనీ ఆలినీ ఎవర్నీ వదల్లేదు. టీచర్లంతా నిలబడి చూస్తున్నారు. వాళ్ళకీ కరస్పాండెంట్ మీద మంటగానే ఉంది. కరస్పాండెంట్ ఇంగ్లీషు తిట్లు లాభం లేదనుకున్నాడో ఏమో ప్యూన్ను పిలిచి పోలీస్‌స్టేషన్‌కు పంపుతున్నాడు.

జోసఫీన్ నా దగ్గరికొచ్చి రెక్కపట్టుకొని 'వెళ్దాం రండి' అంది.

కాసేపట్లో పోలీసులు రావచ్చు. అంటే న్యాయానికి నీతికి ప్రమాదం సంభవించబోతోంది.

వెంటనే రూమువైపు నడిచాను. జోసఫీన్ నావెంటే వచ్చింది.

గదికి తాళం తీసి ఇద్దరంగదిలో అడుగుపెట్టాం.

'ఈ గొడవ ఎంతదూరం వెళ్తుందో ఏమో, పోలీసులు వస్తారేమోనని భయపడి చచ్చాను' అంది జోసఫిన్ కూర్చుంటూ, కూర్చొని పెద్ద ప్రమాదం నుంచి బయట పడ్డట్టు ఊపిరి పీల్చుకుంది. నా నరాల్లో రక్తానికి బదులుగా ఉద్రేకం ఇంకా ప్రవహిస్తూనే ఉంది. నా నోటమాట రాలేదు. ఆ లుచ్చాని, ఆ దగుల్బాజీని మొగం పగిలేటట్లు చెప్పుతో ఎందుకు కొట్టలేకపోయాను అని ఆలోచిస్తున్నాను.

'ఎక్కడ నేర్చుకున్నారో ఏమోగాని ఏ పవర్ఫుల్ తిట్లు తిట్టారండి' అంటూ జోసఫీన్ పగలబడి నవ్వుతోంది.

'చూచారా! అవినీతి ఎంత విచ్చలవిడిగా సాగుతోందో' అన్నాను.

'ఇప్పుడు నీకు జ్ఞానోదయమయింది. మూడేళ్ళుగా ఇలాంటివి నేను సవాలక్ష చూచాను'. అంది జోసఫిన్

'నాకు నవల రాయడం చేతకాదు. చేతనయితే' ఈ దేశం ఇక బాగుపడదు' అన్ని టైటిల్‌తో మాంచి ఘాటైన నవలరాద్దును' అన్నాను.

'శుద్ధ దండుగ, శ్రమ నిష్ఫలం దాన్ని పత్రికలు ప్రచురించవు. ఖర్మ చాలక ప్రచురించినా పాఠకులు చదవరు. రాయదలుచుకుంటే ది మోస్టు రాటనెస్ట్ ఐమీన్. పరమ చెత్త సీరియల్ ఒకటి రాయండి. అట్లాంటి వాళ్ళకోసం తెలుగు సినిమావాళ్ళు ఆవురావురుమని ఎదురు చూస్తుంటాపు. నాలుగు డబ్బులు గిట్టుబటు అవుతాయి' అంది.

'ఇక ఉద్యోగం దొరకదేమోనని భయంగా ఉంది' అన్నాను.

'దొరికితే ఫరవాలేదు. ఈ దేశం బాగుపడుతుంది' అని నవల రాయడానికి ప్రయత్నిస్తారా' అంది నవ్వుతూ.

నాకూ నవ్వు వచ్చింది.

'ఎందుకనుకున్నారు అట్లా' అన్నాను.

'నేను సినికల్‌గా మాట్లాడటం లేదు. అభ్యుదయం విప్లవం ఇట్లాంటి పదాల్ని తారక మంత్రంలా జనించిన కవులూ, రచయితలూ అనేకమంది ఆలిండియా రేడియోలోనో, సినిమా రంగంలోనూ బ్రతుకుతెరువు లభించగానే చప్పగా చల్లబడిపోవడం మనం చూడటం లేదా?' అంది.

'పోనివ్వండి, మీ తిరుగు ప్రయాణమెప్పుడు?' అన్నాను.

'నాలుగింటికి బస్సు వుంది......'

జోసఫిన్ ఏదో చెప్పడానికి సందేహిస్తోంది.

'టైం కావస్తోంది. మీరా, బస్సుకు వెళ్ళడం లేదా?' అన్నాను.

'వెళ్ళాలి. ఛార్జీలకు ఐదు రూపాయలు తక్కువ వుంది మీ దగ్గర ఉంటే అప్పుగా ఇవ్వండి. ఇంటికి. వెళ్ళిన వెంటనే ఎం.ఓ. చేస్తాను' అంది.

జోసఫిన్ నాకంటే దౌర్భాగ్యురాలు! నేను తటస్తనడకపోతే ఏం చేసేదో నా వూహ కందడం లేదు.

జేబులో నుంచి డబ్బు తీసి ఇచ్చాను. డబ్బుతోపాటు అడ్రస్ కూడా తీసుకొని థ్యాంక్స్ చెప్పి వెళ్ళిపోయింది.

నా బస్సు టైమ్ అయింది. కానీ బయటికి అడుగు పెట్టాలంటే అమితమైన భయం కలుగుతోంది.